
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



తిరుపతి
జిల్లా వార్తలు
శనివారం 8 జూన్ 2024

అమాత్యులెవరు?

అందరిలోనూ ఆశలు

ఒకట్రెండు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం

మంత్రి పదవులపై సర్వత్రా చర్చ

చిత్తూరు ఎంపీకి కేంద్ర మంత్రిగా ఛాన్సు

రాష్ట్ర మంత్రి పదవి కోసం పలువురి యత్నాలు

రాష్ట్రంలో అధికారం మారిన నేపథ్యంలో రేపు ప్రధానిగా నరేంద్ర మోదీ, అలాగే ఈనెల 12న సీఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారాలు చేయనున్నారు. ఆయా తేదీల్లోనే కేంద్ర, రాష్ట్ర మంత్రివర్గాలు కూడా ఏర్పాటయ్యే అవకాశాలున్నాయి. లేదంటే కొన్ని రోజుల ఆలస్యం అయినా మొత్తం మీద ఈ నెలలోనే పూర్తిస్థాయి కేంద్ర, రాష్ట్ర మంత్రివర్గాలు ఏర్పాటు కానున్నాయి. దీంతో జిల్లా నుంచీ ఎవరెవరికి మంత్రి పదవులు లభించే అవకాశముంది? ఏ ప్రాతిపదికన? అన్న అంశాలు సర్వత్రా చర్చనీయాంశమవుతున్నాయి. కూటమిలో ఏ పార్టీలో ఎవరికి? సామాజికవర్గాల రీత్యా అయితే ఎవరికి? కొత్త జిల్లాల ప్రకారమా లేక ఉమ్మడి జిల్లాల ప్రకారమా? అన్న ప్రశ్నలు అటు రాజకీయ వర్గాలతోపాటు జనంలోనూ వినిపిస్తున్నాయి. మరోవైపు ఈ చర్చలతో నిమిత్తం లేకుండా జిల్లా నుంచీ పలువురు ఎమ్మెల్యేలు మంత్రి పదవి కోసం ప్రయత్నాలు మొదలుపెట్టారు.



దగ్గుమళ్ల ప్రసాదరావు



అమరనాథరెడ్డి



కిషోర్‌కుమార్‌రెడ్డి

తిరుపతి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ వర్గాల సమాచారం మేరకు కేంద్ర మంత్రివర్గంలో ఎస్సీ సామాజికవర్గం నుంచీ చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు పేరు పరిశీలనలో వుంది. అధిష్ఠానం వద్ద గణనీయమైన పలుకుబడి వున్న కారణంగానే ఆయన ప్రకాశం జిల్లావాసి అయినా చిత్తూరు ఎంపీ టికెట్ తెచ్చుకున్నారని, దానికి తోడు ఎన్నికల్లో అసెంబ్లీ అభ్యర్థుల విజయానికి వీలైన మేరకు ఆర్థికంగా సహకరించారని ఆ వర్గాలు చెబుతున్నాయి. ఉన్నత విద్యావంతుడు కావడం, అఖిల భారత సర్వీసుల అధికారిగా పనిచేసిన నేపథ్యం,అధిష్ఠానం వద్ద పలుకుబడి ఆయనకు అదనపు అర్హత కాగలదని సమాచారం.

రాష్ట్ర మంత్రులుగా ప్రచారంలో ఇద్దరి పేర్లు

తిరుపతి, ఉమ్మడి చిత్తూరు జిల్లాల్లో ఎవరికి మంత్రి పదవులు లభిస్తాయన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారుతోంది. ఉమ్మడి జిల్లాలో 14 స్థానాలు, నెల్లూరు నుంచీ కొత్తగా తిరుపతి పరిధిలోకి చేరిన మూడు స్థానాలూ కలిపి మొత్తం 17 స్థానాలకు గానూ 15 చోట్ల కూటమి అభ్యర్థులు గెలిచిన సంగతి తెలిసిందే. అందులో ఒకరు జనసేన కాగా మిగిలిన వారు టీడీపీకి చెందినవారు. కొత్త జిల్లాల ప్రాతిపదికన మంత్రి పదవులకు ఇద్దరి పేర్లు ప్రచారంలో వున్నాయి. చిత్తూరు జిల్లా నుంచీ పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, అన్నమయ్య జిల్లా నుంచీ పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. అమరనాథరెడ్డి విషయానికి వస్తే కుటుంబానికి సుదీర్ఘ రాజకీయ నేపథ్యం వుండడం, డీసీసీబీ ఛైర్మన్‌గా, ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో పాటు ఉమ్మడి జిల్లా టీడీపీ అధ్యక్షుడిగానూ, మంత్రిగానూ పనిచేసిన అనుభవం ఆయనకు అర్హతలని చెబుతున్నాయి. జిల్లాలో నాయకులను సమన్వయం చేసుకుని పార్టీని ముందుకు నడిపించిన నేతగా ఆయనకు అధిష్ఠానం వద్ద ప్రత్యేక గుర్తింపు వుంది. దానికి తోడు స్థానిక సంస్థల ఎన్నికల్లో కుప్పంలో అధికార పార్టీ వర్గాల ఆగడాలను ఎదుర్కొనడం, నారా లోకేశ్ యువగళం పాదయాత్ర నిర్వహణలో రాయలసీమవ్యాప్తంగా కీలక బాధ్యతలు నిర్వర్తించడం, ఆ క్రమంలో 24 పోలీసు కేసులను ఎదుర్కొనడం ఆయనకు కలసివస్తుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇక పీలేరు ఎమ్మెల్యే కిషోర్ కుటుంబానికి సైతం సుదీర్ఘ రాజకీయ నేపథ్యం వున్న సంగతి తెలిసిందే. తండ్రి మంత్రిగా, అన్న సీఎంగా పనిచేసి వుండడంతో పాటు కిషోర్ గత టీడీపీ ప్రభుత్వంలో హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా పనిచేశారు. పార్టీలో జాతీయ ప్రధాన కార్యదర్శి పదవితో అధిష్ఠానం ఆయనకు ప్రత్యేక గుర్తింపు కల్పించింది. పుంగనూరు సెగ్మెంట్‌లో వైసీపీ ముఖ్యనేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఎదుర్కోవడంతో పాటు తంబళ్ళపల్లి, మదనపల్లె నియోజకవర్గాల్లో కూడా పార్టీ బలోపేతానికి కృషి చేశారన్న పేరుంది. చంద్రబాబుపై కురబలకోటలో వైసీపీ దాడుల ఘటనకు సంబంధించి కిషోర్ పోలీసు కేసులు కూడా ఎదుర్కొన్నారు. వీటన్నింటికీ మించి రాజంపేట పార్లమెంటు పరిధిలో మొత్తం ఏడు స్థానాలకు గానూ వైసీపీ మూడు అసెంబ్లీ సీట్లు, ఒక ఎంపీ సీటు గెలిచి బలంగా ఉనికి చాటుకుంది. అక్కడ టీడీపీ రెండు సీట్లకు, జనసేన ఒక సీటుకు పరి మిత వ ం య్యా ం ు. అలాంటి చోట పార్టీని బలోపేతం చేసి ముందుకు తీసుకెళ్ళడానికి కిషోర్ సేవలు అవసరమని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

సామాజికవర్గాలవారీగా అవకాశాలపై ఆశలు

సామాజిక సమీకరణలు, కూటమి పార్టీల సమీకరణల దృష్ట్యా పలువురు మంత్రి పదవులు ఆశిస్తున్నారు. మదనపల్లె నుంచీ టీడీపీ తరపున గెలిచిన షాజహాన్ బాషాకు ముస్లిం మైనారిటీ కోటాలో మంత్రి పదవి దక్కుతుందని ముస్లిం మైనారిటీ వర్గాలు ఆశిస్తున్నాయి.తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు రాయలసీమ మొత్తం మీద జనసేన తరపున బలిజ సామాజికవర్గం నుంచీ గెలిచిన ఏకైక ఎమ్మెల్యే కావడంతో ఆయనకు మంత్రి పదవి గ్యారంటీ అని ఆ సామాజికవర్గం గట్టి నమ్మకంతో వుంది. ఆ మేరకు ఆయన కూడా తన ప్రయత్నాలు ముమ్మరం చేశారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి కుటుంబ నేపథ్యం, ఆయన తండ్రి దివంగత బొజ్జల గోపాలకృష్ణారెడ్డి అధినేత చంద్రబాబుకు సన్నిహిత మిత్రుడు కావడం వంటి కారణాలతో తిరుపతి జిల్లా నుంచీ ఆయనకు అవకాశం వుంటుందని అక్కడి పార్టీ వర్గాలు విశ్వసిస్తున్నాయి. ఇక చిత్తూరు జిల్లాలో మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమ నాయుడు కుమారుడైన నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్‌కు ఛాన్సు దక్కుతుందని ఆయన అనుచరులు భావిస్తున్నారు.టీడీపీకి కంట్లో నలుసుగా మారిన మాజీ మంత్రి రోజాను భారీ మెజారిటీతో ఓడించిన భానుకు మంత్రి పదవి తప్పక దక్కుతుందన్న విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.ఇక తిరుపతి జిల్లాలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీ గురించి చెప్పక్కర్లేదు.చంద్రబాబు సొంత నియోజకవర్గమైన చంద్రగిరిలో పాతికేళ్ళ తర్వాత రికార్డు మెజారిటీతో గెలిచిన నానీకి అధినేత వద్ద,యువనేత లోకేశ్ వద్ద ప్రత్యేక గుర్తింపు వుంది. గత ప్రభుత్వంలో అధికార పార్టీని ఎదుర్కొని, పార్టీని బలోపేతం చేసే క్రమంలో అనేక ఇబ్బందులకు గురైన నానీకి మంత్రి పదవితో అధిష్ఠానం న్యాయం చేస్తుందని చంద్రగిరి పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సీనియర్ నేత కావడంతో పాటు వియ్యంకుడైన పారిశ్రామికవేత్త గంగాప్రసాద్ అధినేత చంద్రబాబుకు సన్నిహితుడు కావడం వల్ల అవకాశాల్లేకపోలేదని అనుచరవర్గం ఆశాభావంతో వుంది. మాజీ సీఎం నేదురుమల్లి జనార్దనరెడ్డి కుమారుడిని ఓడించడం అదనపు అర్హతగా భావిస్తోంది.

ఎస్సీ సామాజిక వర్గం నుంచీ...

వైద్యరంగంలో ప్రముఖుడు కావడం, అధినేత చంద్రబాబుతో సన్నిహితత్వం వుండడం,మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి కుమార్తెను ఓడించడం వంటి కారణాలతో గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే థామస్‌కు ఎస్సీ కోటాలో మంత్రి పదవి దక్కుతుందని స్థానిక పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.ఎస్సీ మహిళ కోటాలో వైద్యురాలైన సూళ్ళూరుపేట యువ ఎమ్మెల్యే నెలవల విజయశ్రీకి మంత్రివర్గంలో చోటుదక్కే అవకాశాల్లేకపోలేదని అక్కడి పార్టీ శ్రేణులు ఆశాభావంతో వున్నాయి. తండ్రి గతంలో ఎమ్మెల్యేగా, ఎంపీగా పనిచేసి వుండడం ఆమెకు అనుకూలిస్తుందని చెబుతున్నాయి. అలాగే గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సీనియారిటీ కారణంగా ఎస్సీ కోటాలో ఛాన్సుంటుందని ఆయన అనుచరవర్గం నమ్ముతోంది. వైసీపీ ముఖ్యనేత పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డిని సవాల్ చేసిన నేతగా పేరుతెచ్చుకోవడంతో పాటు సత్యవేడులో సంచలన విజయం సాధించిన కోనేటి ఆదిమూలం మంత్రి పదవికి అర్హుడని అక్కడి పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ఇలా మంత్రి పదవుల కోసం తిరుపతి, ఉమ్మడి చిత్తూరు జిల్లాల పరిధిలో విస్తృతస్థాయిలో జనం మధ్య చర్చ నడుస్తోంది. రానున్న ఒకటి రెండు రోజుల్లో దీనిపై స్పష్టత వచ్చే అవకాశముంది.



టీడీపీ విజయంపై నారావారిపల్లెలో పూజలు

చంద్రగిరి, జూన్ 7: ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా విజయఢంకా మోగించడంతో పాటు చంద్రగిరిలో 25 ఏళ్ళ తరువాత టీడీపీ గెలుపొందిన సందర్భాన్ని పురస్కరించుకుని పార్టీ అధినేత చంద్రబాబు సొంతూరులో గ్రామస్థులు శుక్రవారం కులదైవం నాగాలమ్మకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. చంద్రబాబు కుల దైవం కూడా అయిన నాగాలమ్మ పూజల్లో ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీకి స్వర్ణయుగం మొదలైంది

నటుడు శివాజీ



తిరుమల, జూన్7(ఆంధ్రజ్యోతి): 'స్వామిని చూస్తే కళకళలాడుతున్నారు. ఇంతకుముందు తేడాగా ఉన్నారు. స్వామి దగ్గర డ్రామాలు దొబ్బితే ఎవరికైనా ఇదే శిక్ష' అని సినీనటుడు శివాజీ వ్యాఖ్యానించారు. తిరుమల శ్రీవారిని శుక్రవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఏపీకి స్వర్ణయుగం మొదలైందని, ఇది స్వామి నిర్ణయమన్నారు.అమరావతి, పోలవరం ఏపీకి లక్ష్యాలని, స్వామి దగ్గర మాట ఇచ్చినోళ్లకి ఎటువంటి పాఠాలు నేర్పించాడో అందరూ చూశారన్నారు.చంద్రబాబు నాయకత్వాన టీడీపీ, బీజేపీ, జనసేన ఆధ్వర్యంలో ఏపీ అద్భుతమైన ప్రగతి సాధిస్తుందన్నారు. అందులో ఎలాంటి అనుమానం లేదన్నారు. 'మీరు తిట్టినా కొట్టినా తిరిగి కర్మ మీ చుట్టూ తిరిగింది. మిమ్మల్ని ప్రజలు తిడుతున్నారు, కొడుతున్నారు. అవసరమా' అని వైసీపీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఎవరైనా ప్రజలను ఇబ్బంది పెట్టకూడదన్నారు. కాగా, బాలీవుడ్ నిర్మాత ఏక్తాకపూర్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి

ముఖేష్ కుమార్ మీనా



తిరుమల, జూన్7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిన సందర్భంగా శ్రీవారి ఆశీస్సులు తీసుకునేందుకు వచ్చినట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. తిరుమల వేంకటేశ్వరస్వామిని శుక్రవారం ఉదయం దర్శించుకున్న ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి లడ్డూప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియను ప్రొఫెషనల్ పద్ధతిలో నిర్వహించామన్నారు. కొత్త ప్రభుత్వం బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధంగా ఉందన్నారు.

పెళ్లకూరులో ఉద్రిక్తత

● టీడీపీ శ్రేణులపై దాడి కేసులో కామిరెడ్డి సహా 9మంది అరెస్ట్



సత్యనారాయణరెడ్డిని కోర్టుకు తీసుకెళుతున్న పోలీసులు



పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయించిన మహిళలతో చర్చిస్తున్న పోలీసులు

పెళ్లకూరు, జూన్ 7: వైసీపీ నేత, ఎన్డీసీసీబీ మాజీ ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి అరెస్ట్‌తో పెళ్లకూరు పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించడంతో చిల్లకూరుకు చెందిన టీడీపీ కార్యకర్త దువ్వూరు విజయసేనారెడ్డి గురువారం రాత్రి తన ఇంటి వద్ద టపాకాయలు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన వైసీపీ నేత కామిరెడ్డి అనుచరులు అతడిపై మూకుమ్మడి దాడికి పాల్పడగా ఆయన కుమారుడు దువ్వూరు రాకేష్‌రెడ్డి అడ్డురావడంతో ఆయనపై కూడా దాడి చేశారు.బాధితుల ఫిర్యాదు మేరకు దాడికి ప్రేరేపించిన కామిరెడ్డితో పాటు ఆయన అనుచరులు 8మందిని గురువారం అర్ధరాత్రి పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.ఈ విషయం తెలుసుకున్న వైసీపీ శ్రేణులతో పాటు మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య శుక్రవారం ఉదయం స్టేషన్ వద్దకు చేరుకుని పోలీసులతో వాగ్వాదానికి దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.ఏఎస్పీ కులశేఖర్, డీఎస్పీ శ్రీనివాసులురెడ్డి, సీఐలు జగన్మోహన్‌రావు, శ్రీనివాసులురెడ్డి,ఎస్ఐలు రవిబాబు, గోపి, తిరుమలరావు తదితరులు వైసీపీ నేతలతో చర్చించడంతో పరిస్థితి సద్దుమణిగింది. కామిరెడ్డితో పాటు ఆయన అనుచరులపై 307వ సెక్షన్ కింద కేసు నమోదు చేసి సాయంత్రం కోర్టుకు తరలించారు.గతంలో ఇరు వర్గాలకు పాతకక్షలున్న నేపథ్యంలో విజయసేనారెడ్డి టపాకాయలు కాల్చడంతో అవి గడ్డివాములు, ఇళ్లపై పడుతున్నాయని సత్యనారాయణరెడ్డి అనుచరులు దాడికి పాల్పడ్డారని ఎస్ఐ శ్రీకాంత్ చెప్పారు.విజయసేనారెడ్డి, రాకేష్‌రెడ్డి కలబడడంతో వారికి గాయాలయ్యాయని తెలిపారు. వైసీపీ నేతల ఫిర్యాదు మేరకు వారిపైనా 324వ సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.మరో 15 మంది అనుమానితులపై కూడా విచారణ జరిపి కేసులు నమోదు చేయనున్నట్లు ఎస్ఐ తెలిపారు.



నీరబ్‌కుమార్ ప్రసాద్



ముద్దాడ రవిచంద్ర

చిత్తూరు మాజీ కలెక్టర్లకు
కొత్త ప్రభుత్వంలో కీలక కొలువులు

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 7: గతలో ఉమ్మడి చిత్తూరు జిల్లా కలెక్టర్లుగా పనిచేసినవారిలో ఇద్దరు కూటమి ప్రభుత్వంలో కీలక బాధ్యతల్లో ఉండబోతున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)గా నియమితులైన సీనియర్ ఐఏఎస్ అధికారి నీరబ్‌కుమార్ ప్రసాద్ 1998లో చిత్తూరు జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. ఈ బాధ్యతల్లో ఆయన ఉన్నది 9 నెలలే అయినా అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ప్రవేశపెట్టిన జన్మభూమి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు. జిల్లాలో ఆ సమయంలో కరువు తీవ్రంగా ఉంది. మండలాల్లో విస్తృతంగా పర్యటిస్తూ పనికి ఆహార పథకాన్ని ఆయన సమర్థంగా అమలు చేశారు. ఈయన 1987 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. చంద్రబాబు నాయుడు పాలనలో కీలక శాఖలకు ముఖ్య కార్యదర్శిగా ఆయన పనిచేశారు.

- ఇక 2008-09లో చిత్తూరు జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించిన ముద్దాడ రవిచంద్ర ఏపీ సీఎం ముఖ్య కార్యదర్శిగా సీఎంవోలో బాధ్యతలు స్వీకరించనున్నారు.ఈయన 1996 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి.

రాజీనామా చేసి వెళ్లండి



ఎస్వీయూ వీసీ శ్రీకాంత్‌రెడ్డితో మాట్లాడుతున్న తెలుగు యువత నాయకులు

● ఎస్వీయూ వీసీకి తెలుగు యువత విజ్ఞప్తి

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), జూన్ 7: 'టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.. వైసీపీ ప్రభుత్వ హయాంలో నియమితులైన మీరు పదవికి రాజీనామా చేసి వెళ్లండి' అంటూ ఎస్వీయూ వీసీ శ్రీకాంత్‌రెడ్డికి తెలుగు యువత నాయకులు విజ్ఞప్తి చేశారు. తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనంద్‌గౌడ్, రాష్ట్ర అధికార ప్రతినిధి శేషాద్రి నాయుడు, నాయకులు రామ్మోహన్, కృష్ణమూర్తి తదితరులు శుక్రవారం వీసీ చాంబర్‌కు వెళ్లి పదవికి రాజీనామా చేయాలంటూ వీసీ శ్రీకాంత్‌రెడ్డికి సూచించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో వీసీగా వచ్చిన రాజేంద్ర ప్రసాద్‌ను గతంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో తీవ్రంగా అవమానించి.. పంపారని గుర్తుచేశారు. అలాంటి పని చేయబోమని, తమకు సంస్కారం ఉందని చెప్పారు. అందువల్ల పదవికి రాజీనామా చేయాలని కోరారు. ఇక ఎన్నికల్లో వైసీపీకి అనుకూలంగా ప్రచారం చేసినట్టు తమ వద్ద వాయిస్ మెసేజ్‌లు ఉన్నాయని, గత వీసీ రాజేంద్రప్రసాద్ పదవి నుంచి పంపడంలో మీప్రమేయం కూడా ఉందని ఆరోపించారు. తనకు తెలిసిన ఓ టీడీపీ ఎమ్మెల్యేతో సంప్రదించి నిర్ణయం తీసుకుంటానని వీసీ చెప్పగా, తెలుగు యువత నాయకులు ససేమిరా అన్నారు. దీంతో తీవ్ర వాగ్వాదం జరగడంతో సెక్యూరిటీ సిబ్బంది ఇటు వీసీని, అటు నాయకులకు సర్దిజెప్పారు. ఈ క్రమంలో వీసీ తన చాంబర్ నుంచి వెళ్లిపోయారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పదవులు పొందిన వారు స్వచ్ఛందంగా రాజీనామా చేయాలని ఆనంద్‌గౌడ్ సూచించారు. లేకుంటే తామే పదవుల నుంచి సాగనంపుతామని స్పష్టం చేశారు. కాగా, టీడీపీ, తెలుగు యువత నాయకుల ఆందోళనతో ఎస్వీయూ వీసీ బంగ్లా వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

సహనం కోల్పోకండి

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలంటూ ప్రజలకు పోలీసుల విజ్ఞప్తి

తిరుపతి(నేరవిభాగం), జూన్ 7 : ఎన్నికల ఫలితాలు వెలువడ్డ తరువాత కొన్ని ప్రాంతాల్లో వర్గ వైషమ్యాలు, హింసాత్మక ఘటనలు చోటుచేసుకోవడం ఆందోళనకరమైనప్పటికీ ప్రజలెవరూ సహనం కోల్పోకూడదని ఎస్పీ హర్షవర్ధనరాజు ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.అనవసరంగా ఆవేశాలకు లోనై హింస చెలరేగే విధంగా ఎవరూ ప్రవర్తించకూడదన్నారు.చట్ట పరిధిలో అందరూ సమానమనే విషయం మరిచిపోకూడదన్నారు. రౌడీయిజం, దౌర్జన్యం ఎవ్వరు చేసినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో ఎప్పటిలాగే ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు.





బయో ఎంజైమ్ తయారీపై శిక్షణ

తిరుపతి(విద్య), జూన్ 7: రైల్వేకాలనీలోని సరస్వతి శిశుమందిర్ స్కూల్‌లో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సౌజన్యంతో బయో ఎంజైమ్ తయారీపై మహిళలకు, కుటీర పరిశ్రమ నిర్వాహకులకు శుక్రవారం శిక్షణ నిర్వహించారు. రిటైర్డ్ ప్రొఫెసర్లు కీర్తివెంకయ్య, హేమంత్‌కుమార్, రిటైర్డ్ ఎల్ఐసీ ఆఫీసర్ శ్రీదేవి, ఎస్వీ ఆయుర్వేద కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ దత్తాత్రేయ, బీజేపీ జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ గుండాల గోపీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ ఫస్ట్ సెమిస్టర్ ఫలితాలు విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 7: పద్మావతి యూనివర్సిటీ బీటెక్ ఫస్ట్ సెమిస్టర్ ఫలితాలు విడుదలయ్యాయి. ఎస్పీఎంవీవీ.. వెబ్‌సైట్‌లో ఈ ఫలితాలను పొందుపరిచారు.

వీధిలో గొడవలను టీడీపీకి రుద్దొద్దు

- వైసీపీకి పులివర్తి సుధారెడ్డి సూచన

చంద్రగిరి, జూన్ 7 : సోషల్ మీడియాలో రెచ్చగొట్టి హింసాత్మక ఘటనలకు పాల్పడే విధంగా ప్రేరేపించే వారిపై పార్టీలకు అతీతంగా చర్యలు తీసుకోవాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి పోలీసులను కోరారు. వైసీపీ నాయకుడు మస్తాన్ టీడీపీతో పాటు తనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టు చేసిన వీడియోను చూసిన ఆమె ఆమె శుక్రవారం చంద్రగిరి చేరుకుని డీఎస్పీ రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీధిలో గొడవలను పార్టీపై రుద్దడం మంచి పద్ధతి కాన్నారు. సంబంధం లేని అంశాలను పార్టీకి అంటగట్టాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. సుధారెడ్డి ఫిర్యాదుతో మస్తాన్‌ను పోలీసులు స్టేషన్‌కు పిలిపించారు. తనపై అకారణంగా దాడులు చేస్తున్నారని, ఇందుకు పులివర్తి సుధారెడ్డి ప్రోత్సహిస్తున్నారంటూ మస్తాన్ ఒక వీడియో సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. ఈ విషయమై స్టేషన్ ఆవరణలో చర్చలు జరిపారు.చివరకు పులివర్తి సుధారెడ్డి పేరు ప్రస్తావిస్తే గొడవలు సద్దుమణుగుతాయనే ఉద్దేశంతో తాను వీడియో పోస్టు చేసినట్లు మరో వీడియోలో మస్తాన్ తెలిపారు. సుధారెడ్డిని ప్రస్తావిస్తూ చేసిన వీడియోకు ఆమెను క్షమాపణలు కోరుతున్నట్లు తెలిపారు.

టీటీడీలో పురోహితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : నవీన్

తిరుపతి (జీవకోన), జూన్ 7: తిరుమలలోని కల్యాణవేదికలో పనిచేస్తున్న పురోహితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. కల్యాణ వేదికలో పనిచేస్తున్న పురోహితులు శుక్రవారం ఆయన్ను కలిసి సన్మానించి, తమ సమస్యలను తెలియజేశారు. ఈసందర్భంగా నవీన్ మాట్లాడుతూ.. తిరుమలలో 20 ఏళ్లుగా పౌరోహిత్యాన్ని నమ్ముకుని తరతరాలుగా జీవనం సాగిస్తున్న సుమారు 110మంది కల్యాణ వేదిక పురోహితులు చాలీచాలని జీతాలతో ఇబ్బంది పడుతున్నారని చెప్పారు.ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. టీడీపీ నేత భువన్ కుమార్‌రెడ్డి, పురోహిత సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ధర్మారెడ్డికి శిక్ష తప్పదు: టీడీపీ

తిరుపతి అర్బన్, జూన్ 7: టీటీడీని అప్రతిష్టపాలు చేసిన ఈవో ధర్మారెడ్డికి శిక్ష తప్పదని టీడీపీ నేత ఇనుకొండ సుబ్రహ్మణ్యం జోస్యం చెప్పారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఈవో, ఆయన అనుచర ఉద్యోగులు లెక్కలేనన్ని పాపాలు చేశారన్నారు. అక్రమాలకు పాల్పడి.. తిరుమలను అపవిత్రం చేశారన్నారు. కల్యాణకట్టలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్‌ను స్థాపించి క్షురకుల నుంచి ముడుపులు వసూలు చేశారన్నారు. ఈ విషయాన్ని ఈవో పట్టించుకోలేదని, అమాయకపు క్షురకులను మాత్రం వేధించేవారన్నారు. టీటీడీ ఉద్యోగుల ఇళ్ల స్థలాల్లోనూ రోజాకు వాటా ఉందన్నారు.

వైసీపీ కార్యకర్తకు పరామర్శ

చంద్రగిరి, జూన్ 7: చంద్రగిరి గాండ్లవీధిలో వుంటోన్న వైసీపీ కార్యకర్త రాజశేఖర రెడ్డిని శుక్రవారం రాత్రి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి పరామర్శించారు. శుక్రవారం ఉదయం టిఫిన్ సెంటర్‌కు వెళుతుండగా తనపై టీడీపీ కార్యకర్త గురునాథరెడ్డి దాడి చేశారంటూ రాజశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ సమాచారం అందుకున్న చెవిరెడ్డి ఆయన ఇంటికి వచ్చి పరామర్శించాడు. ఎ.రంగంపేటలో వైసీపీ కార్యాలయాన్ని గురువారం కొందరు ధ్వంసం చేయడంతో చెవిరెడ్డి కార్యాలయాన్ని సందర్శించారు.



రైలు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోండి

- సీఆర్ఎస్వో మాధవి

తిరుపతి(ఆటోనగర్), జూన్ 7: రైలు ప్రమాదాలు జరగకుండా అధికారులు పటిష్ఠమైన జాగ్రత్తలు తీసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ రైల్వే సేఫ్టీ ఆఫీసర్ (సీఆర్ఎస్వో) మాధవి ఆదేశించారు. రేణిగుంట- కాట్పాడి రైల్వే జంక్షన్ల మధ్య రైలు మార్గం తనిఖీల్లో భాగంగా శుక్రవారం రేణిగుంట రైల్వే జంక్షన్‌లోని కీలకమైన విభాగాలు పరిశీలించారు. ప్రధానంగా లోకో పైలట్లు, గార్డులకు విధులు కేటాయించే విభాగంలో రికార్డులు తనిఖీ చేశారు. ఇటీవల యార్డులో జరిగిన ప్రమాదాలను అడిగి తెలుసుకున్నారు. గూడ్స్ రైళ్లు పట్టాలు తప్పిన సంఘటనలపైనా ఆరా తీశారు. అనంతరం స్టేషన్ మాస్టర్ల విభాగాన్ని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు డివిజన్ ఏడీఆర్ఎం సుధాకర్, సీనియర్ స్కేల్ అధికారులు లక్ష్మీనాయక్, సూర్యనారాయణ, చంద్రశేఖర్, హరికృష్ణారెడ్డి, సురేష్, స్థానిక అధికారులు ఖాదర్‌బాష, మునిశేఖర్, ఐపీఎఫ్ సందీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రేణిగుంటలో అధికారులతో చర్చిస్తున్న మాధవి

కూటమి గెలుపుతో రాష్ట్రంలో అభివృద్ధి ఆరంభం : తెలుగు యువత

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 7: కూటమి గెలుపుతో రాష్ట్రంలో అభివృద్ధి ఆరంభమైందని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు అన్నారు. శుక్రవారం నగరంలో భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న తెలుగు యువత, టీఎన్ఎస్ఎఫ్, యువత, విద్యార్థులను ఉద్దేశించి రవినాయుడు మాట్లాడారు. ఐదేళ్లుగా జగన్.. యువత భవిష్యత్తును నాశనం చేశారని విమర్శించారు. కూటమి గెలుపుతోనే తమకు ప్రయోజనం కలుగుతుందని యువత ఓటు వేశారని తెలిపారు. ఇందుకు యువతకు కృతజ్ఞతలు తెలియజేశారు. టీఎన్ఎస్ఎఫ్ నేత హేమంతరాయల్ మాట్లాడుతూ.. జీవో 77 రద్దు చేసి అర్హులైన విద్యార్థులందరికీ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించనున్నట్టు తెలిపారు.కాగా, సంబరాలకు అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీనిపై రవినాయుడు, పోలీసుల మధ్య వాగ్వాదం జరిగింది.



కేక్ కట్ చేస్తున్న రవినాయుడు తదితరులు

ప్రజలకు ధన్యవాదాలు: వరప్రసాద్



తిరుపతి అర్బన్, జూన్ 7: తిరుపతి ఎంపీ అభ్యర్థిగా బీజేపీ తరఫున పోటీచేసిన వరప్రసాద్ పరాజయం చెందినా.. అధిక ఓట్లు నమోదవడంపై ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. దాదాపు ఆరు లక్షలకుపైగా ఓట్లు బీజేపీకి వచ్చాయని గుర్తుచేశారు. దురదృష్టవశాత్తూ స్వల్ప తేడాతో ఓడిపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా ప్రజల్లో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కూటమి ప్రభుత్వానికి, తిరుపతి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆరణి శ్రీనివాసులుకు అభినందనలు తెలియజేశారు. నాయకులు అజయ్‌కుమార్, వరప్రసాద్, పొనగంటి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మూలస్థాన ఎల్లమ్మకు పొంగళ్లు

చంద్రగిరి, జూన్ 7: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయఢంకా మోగించడంతో భీమవరం గ్రామస్తులు చంద్రగిరిలోని మూలస్థాన ఎల్లమ్మకు పొంగళ్లు పెట్టారు. గ్రామంలో వినాయకస్వామి ఆలయంలో పులివర్తి సుధారెడ్డితోపాటు గ్రామస్తులు ప్రత్యేక పూజలుచేసి, అక్కడి నుంచి చంద్రగిరికి బయల్దేరారు. అలాగే చంద్రగిరి ఎమ్మెల్యేగా పులివర్తి నాని అత్యధిక మెజారిటీతో గెలుపొందడంతో ఎ.రంగంపేట గ్రామంలో టీడీపీ బీసీ సెల్ నాయకుడు గుడిమల్లం చెంగ్రాయాచారి ఆధ్వర్యంలో గ్రామదేవత అయిన దొడ్డి గంగమ్మకు ప్రత్యేక పూజలు చేసి, 501 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా సుధారెడ్డి మాట్లాడుతూ.. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని చెప్పారు. పార్టీలకు అతీతంగా మహిళలకు ఏ సమస్య వచ్చినా తాను ముందుంటానని భరోసా ఇచ్చారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎ.రంగంపేటలో కొబ్బరికాయలు కొడుతున్న టీడీపీ నాయకులు

ఘనంగా వ్యవసాయ కళాశాల వార్షికోత్సవం




బహుమతులు అందుకున్న విద్యార్థులతో అధికారులు

తిరుపతి రూరల్, జూన్ 7: తిరుపతిలోని ఎస్వీ వ్యవసాయ కళాశాల 63వ వార్షికోత్సవం శుక్రవారం సాయంత్రం వెటర్నరీ వర్సిటీ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ అగ్రి డీన్ జి.కరుణాసాగర్, విద్యార్థి వ్యవహారాల డీన్ కె.సాంబశివరావు, హైదరాబాద్ కెనరా బ్యాంక్ జోనల్ మేనేజర్ బి.చంద్రశేఖర్‌రెడ్డి, వర్సిటీ ఈసీ సభ్యుడు పీవీ సత్యగోపాల్, ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ సి.రమణ, వ్యవసాయ కళాశాల ఏడీ జి.ప్రభాకర్ రెడ్డి హాజరై.. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కరుణాసాగర్ మాట్లాడుతూ.. నాణ్యమైన వ్యవసాయ విద్యని అందించడంలో అంతర్జాతీయ స్థాయిలో వర్సిటీ ప్రత్యేక గుర్తింపు సాధించిందని చెప్పారు. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు వ్యవసాయరంగంలోని ఉద్యోగ, ఉపాధి అవకాశాలతోపాటుగా బ్యాంకింగ్, బీమారంగంలో ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. సత్యగోపాల్ మాట్లాడుతూ.. రైతు సంక్షేమమే ధ్యేయంగా భవిష్యత్‌ని నిర్దేశించుకోవాలని తెలిపారు. రమణ మాట్లాడుతూ.. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు విద్యార్థులు సన్నద్ధం కావాలని ఆకాంక్షించారు. అనంతరం వివిధ అంశాల్లో ప్రతిభచాటిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

సురేష్ పిళ్లై నవలకు రెడ్డెమ్మ పురస్కారం

- 12న చిత్తూరులో బహుమతుల కార్యక్రమం



చిత్తూరు కల్చరల్, జూన్ 7: చిత్తూరు నగరంలోని రాజామహల్ హోటల్‌లో ఈనెల 12న కుప్పం రెడ్డెమ్మ జాతీయస్థాయి సాహితీ పురస్కారాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ కె. రామలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోహిణి పంజారి రచించిన 'నల్లసూరీడు', డాక్టర్ ఎం.సుగుణరావు రచించిన 'సుగుణ కథాభిరామం' కథలు బహుమతులకు ఎంపికయ్యాయని తెలిపారు. అలాగే శ్రీకాళహస్తికి చెందిన రచయిత కె.ఎ.మునిసురేష్ పిళ్లై రచించిన 'పుత్రిక శత్రు', సి.కాశిపురం ప్రభాకర్‌రెడ్డి రచించిన 'మేడం' నవలకు బహుమతులు లభించినట్లు వివరించారు.





నేడు 4 గంటలు విద్యుత్ సరఫరా బంద్

తిరుపతి(ఆటోనగర్), జూన్ 7: సబ్‌స్టేషన్ల మరమ్మతుల కారణంగా శనివారం నాలుగు గంటలపాటు విద్యుత్ సరఫరా బంద్ చేస్తున్నట్లు ఈఈ కె.వాసుదేవరెడ్డి తెలిపారు. తిరుపతి స్మార్ట్ సిటీతోపాటు, రేణిగుంట మండలం, తిరుపతి రూరల్ మండలంలో పలు గ్రామాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి సబ్‌స్టేషన్ల మరమ్మతు చేయాల్సి ఉందన్నారు. ఇందులోభాగంగా అలిపిరి, తిరుచానూరు రోడ్డులోని 220,132 కేవీ సబ్‌స్టేషన్ల మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు స్మార్ట్ సిటీ పరిధిలో అన్ని ప్రాంతాలు, తిరుపతి రూరల్ మండలంలోని కేసీపేట, తిరుచానూరు, ఎల్ఎస్ నగర్, పేరూరు, యూనివర్సిటీ, మంగళం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

తిరుపతి అభివృద్ధికే ప్రాధాన్యం



మీడియాతో మాట్లాడుతున్న ఆర్సీ మునికృష్ణ

తిరుపతి అర్బన్, జూన్ 7: తిరుపతి అభివృద్ధికే ప్రాధాన్యమిస్తామని టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, జనసేన నాయకుడు ఆరణి శివకుమార్ తెలిపారు. శుక్రవారం వారు ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. మోదీ సహకారంతో చంద్రబాబు, పవన్ కల్యాణ్ తోడ్పాటుతో తిరునగరిని అన్నివిధాలా ముందుకు తీసుకెళ్తామన్నారు. స్మార్ట్‌సిటీ కార్పొరేషన్‌కు మరిన్ని నిధులు తెప్పించి.. పెండింగ్‌లోని పనులన్నింటినీ పూర్తిచేసి తీరుతామని స్పష్టం చేశారు. గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపి ఆధ్యాత్మిక నగరంలో వాటి వాసన లేకుండా చేస్తామని భరోసా ఇచ్చారు. టీడీఆర్ బాండ్ల స్కాంపై విచారణ జరిపి, చట్టపరంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధి పేరుతో కొందరు వైసీపీ కార్పొరేటర్లే ప్రజలను దోచుకుతిన్నారని విమర్శించారు. భూమన అవినీతిపై విచారణ ఖాయమని స్పష్టం చేశారు. మాస్టర్ ప్లాన్ రోడ్ల బాధితులకు న్యాయం చేస్తామన్నారు.

వైసీపీలో బానిస బతుకే: నగరాభివృద్ధికి వైసీపీ కార్పొరేటర్లు కూడా తమతో జతకట్టాలని ఆర్సీ, జనసేన నేత శివకుమార్ పిలుపునిచ్చారు. వైసీపీలో ఉంటే బానిస బతుకుతప్ప, కనీస మర్యాద కూడా ఉండదన్నారు. మరో కార్పొరేటర్ అనిత మాట్లాడుతూ ఒక్క అంకణం ఆక్రమించి ఉంటే.. ఓట్లు వేయవద్దని భూమన కోరారని, దానిని ప్రజలు అమలు చేసినందుకు ధన్యవాదాలన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు కల్పనయాదవ్, నారాయణ, జనసేన నాయకులు సి.కె.రవి, యాదవ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో అక్రమాలపై న్యాయ విచారణ చేపట్టాలి : తెలుగుయువత

తిరుపతి అర్బన్, జూన్ 7: ఎస్వీయూలో ఐదేళ్లుగా జరిగిన అక్రమ నియామకాలు, పదోన్నతులు, నిధుల దుర్వినియోగంపై న్యాయ విచారణ జరిపించాలని తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఎస్వీయూ రెక్టార్‌గా, వీసీగా ఉన్న సమయంలో ప్రొఫెసర్ శ్రీకాంత్‌రెడ్డి ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారని, పాలకమండలి నిర్ణయాలను తుంగలో తొక్కారని విమర్శించారు. అయనపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్వీయూ అక్రమాలకు సంబంధించి గవర్నర్‌కు లేఖ రాశామని గుర్తుచేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని లెక్కచేయక నియామకాలు చేపట్టారని, రుసా నిధులు కూడా దుర్వినియోగం చేయడం దారుణమన్నారు. తెలుగుయువత్ రాష్ట్ర అధికార ప్రతినిధి శేషాద్రి నాయుడు, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

టూరిజం అసిస్టెంట్ మేనేజర్ బదిలీ

తిరుమల, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని ఏపీ టూరిజం హోటల్‌లో పనిచేసే అస్టిసెంట్ మేనేజర్‌ను బదిలీ చేశారు. టూరిజం సంస్థ తిరుమలలో నాలుగు హోటళ్లను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా హరిత శ్రీనివాసం హోటల్‌లో అసిస్టెంట్ మేనేజర్‌గా ఉన్న రోశిరెడ్డిని ఈనెల 1వ తేదీ నుంచి రిలీవ్ చేస్తున్నట్లు ఆశాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. తిరుమలలో అదనపు విధులను చేపట్టాలని తిరుపతిలో పనిచేస్తున్న హరిప్రసాద్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించారు.

నివాసాల మధ్య వరాహ సంచారం

- పెరుగుతున్న దోమలు
- వెంటాడుతున్న సీజనల్ వ్యాధుల భయం

బాలాయపల్లి, జూన్ 7: మండలంలోని పలు గ్రామాల్లో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. వెంగమాంబపురం, పచ్చారుచేను, యాచవరం, కడగుంట, బాలాయపల్లి సహా ఇతర గ్రామాల్లో ప్రజలు హడలిపోతున్నారు. పందులు నివాసాల మధ్యలో తిరగడమే కాకుండా ఇళ్లలోకి చొరబడుతున్నాయని పజలు వాపోతున్నారు. వర్షాలు కురుస్తుండడంతో నీటి నిల్వలు చేరి అపరిశుభ్రంగా తయారవుతున్నాయి. ఆ నీటిలో పందులు చేరడంతో పరిసరాలు దుర్గంధభరితంగా తయారవుతున్నాయి. వానలు కురుస్తుండడంతో దోమలు ప్రబలి డెంగ్యూ, మలేరియా, విషజ్వరాల బారిన పడతామేమోనని గ్రామస్తులు భయపడుతున్నారు. పందుల సంచారం ఎక్కువగా ఉండడంతో బోర్ల కింద వేసిన పంటలు ధ్వంసం చేస్తాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పందుల బెడద తొలగించాలని ఆయా గ్రామాల్లోని ప్రజలు అధికారులను కోరారు. పందుల ను తరలించుకు పోవాలని యజమానులకు పంచాయతీ అధికారులు పలుమార్లు హెచ్చరించినా వారు పట్టించుకోవడం లేదు. దీంతో పలుమార్లు పంచాయతీ అధికారులు రంగంలోకి దిగి పందులను పట్టించి ఊరికి దూరంగా వదిలిన సంఘటనలు ఉన్నాయి. అయితే యజమానులు వాటిని యథావిధిగా తీసుకువచ్చి గ్రామాల్లో విడిచి పెడుతున్నట్టు ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి పందుల బెడద నుంచి శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామీణులు కోరుతున్నారు.



బాలాయపల్లిలో నివాసాల మధ్య సంచరిస్తున్న పందులు

చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే పాశిం



గూడూరు, జూన్ 7: గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పాశిం సునీల్‌కుమార్ గెలుపొందడంతో గురువారం రాత్రి ఉండవల్లిలో టీడీపీ అధినేత చంద్రబాబుని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. దీంతో చంద్రబాబు అభినందించినట్లు పాశిం తెలిపారు.

చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే రామకృష్ణ





వెంకటగిరి, జూన్ 7: ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ గురువారం అమరావతిలోని పార్టీ కార్యాయంలో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబును, టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. అదే విధంగా అమరావతి నుంచి శుక్రవారం నెల్లూరుకు చేరుకున్న ఆయన ఎమ్మెల్యేలు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలందించి అభినందనలు తెలిపారు.

అన్ని రంగాల్లో పారదర్శక పాలన: విజయశ్రీ



విజయశ్రీ, పార్థసారథి దంపతులను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

నాయుడుపేట, జూన్ 7: అన్ని రంగాల అభివృద్ధిలో పారదర్శక పరిపాలన కూటమి ప్రభుత్వం అందిస్తుందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేట పట్టణలో శుక్రవారం ఎమ్మెల్యే విజయశ్రీ, పార్థసారధి దంపతులను టీడీపీ నాయకులు, ప్రముఖ వ్యాపారవేత్తలు పూనాటి తిరుమలనాయుడు, జీవీఆర్‌నాయుడు శాలువా, గజపూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా విజయశ్రీ మాట్లాడుతూ... నియోజకవర్గంలో మౌలిక సదుపాయాలను వేగవంతంగా అందిస్తామన్నారు. అలాగే సుదీర్ఘ కాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. గాంధీనాయుడు, లక్ష్మీనరసింహనాయుడు, వెంగయ్య నాయుడు, నరసింహనాయుడు, సంపత్‌నాయుడు, శ్రీనివాసులునాయుడు, రామానాయుడు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నారాయణను కలిసిన వేనాటి సతీష్ రెడ్డి



సూళ్లూరుపేట, జూన్ 7: సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన నెల్లూరు సిటీ, ఆత్మకూరు ఎమ్మెల్యేలు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డిని శుక్రవారం టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి నెల్లూరు వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎం. శ్రీహరి రెడ్డి, బాలకృష్ణ చౌదరి ఉన్నారు.

చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యేలు



సూళ్లూరుపేట, జూన్ 7: సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించిన సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీతో పాటు సత్యవేడు, వెంకటగిరి, గూడూరు ఎమ్మెల్యేలు ఆదిమూలం, సునీల్ కుమార్, కురుగొండ్ల రామకృష్ణ, టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్ గురువారం రాత్రి ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు అందుకున్నారు. నాలుగు నియోజకవర్గాల్లో టీడీపీ గెలుపునకు కృషి చేసిన కొండేపాటిని చంద్రబాబు అభినందించారు.

కొండేపాటి ఇంటి వద్ద కోలాహలం..



ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించడంతో కొండేపాటి గంగాప్రసాద్ ఇంటి వద్ద కోలాహలం నెలకొనింది. సూళ్లూరుపేట, సత్యవేడు, గూడూరు, వెంకటగిరి నియోజకవర్గాల నుంచి టీడీపీ నాయకులు విచ్చేసి మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేస్తున్నారు. శుక్రవారం పార్టీ నాయకులు, కార్యకర్తలు కొండేపాటిని ఘనంగా సన్మానించారు.

కురుగొండ్ల విజయాన్ని పురస్కరించుకుని...

పేదలకు బిర్యానీ ప్యాకెట్ల పంపిణీ



వెంకటగిరి, జూన్ 7: వెంకటగిరిలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, రాష్ట్రంలో కూటమి విజయాన్ని పురస్కరించుకొని శుక్రవారం ముస్లింలు పట్టణంలోని కాశీపేట కూడలిలో బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ జిందాబాద్, కురుగొండ్ల నాయకత్వం వర్ధిల్లాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్కే అల్తాఫ్, ఎస్కే గౌస్‌బాషా, పి.ఖాదర్‌ఖాన్, మస్తాన్, ఎస్కే రబ్బానీ, జనసేన పార్టీ నాయకుడు రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

గూడూరు అర్బన్, జూన్ 7: పట్టణంలోని సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో శుక్రవారం శ్రీ కృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం జరిగింది. కార్యక్రమంలో మహేశ్వరి, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

కనుపూరు ముత్యాలమ్మ హుండీ లెక్కింపు

చిల్లకూరు, జూన్ 7 : మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో కొలువై ఉన్న ముత్యాలమ్మ అమ్మవారి హుండీ లెక్కింపు శుక్రవారం జరిగింది. అమ్మవారి హుండీలో భక్తులు నగదు రూపంలో వేసిన కానుకలు రెండు నెలలకు గాను రూ.30,17,383 ఆదాయం వచ్చినట్లు ఈవో నవీన్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి చైర్‌పర్సన్ ఇంద్రసేనమ్మ, సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు రుణపడి ఉంటా: సునీల్

గూడూరు, జూన్ 7: ఈ ఎన్నికల్లో 21 వేలకు పైగా మెజార్టీతో తనను ఎమ్మెల్యేగా గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... తాను ఎవరిపై కక్షసాధింపు చర్యలకు పాల్పడనని, టీడీపీ కార్యకర్తల జోలికి వస్తే వదిలే ప్రసక్తే లేదన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అవినీతిని వెలికి తీస్తామని, అధికారులు న్యాయబద్ధంగా విధులు నిర్వహించాలన్నారు. చిల్లకూరు మండలంలో సిలికా తవ్వకాల్లో జరిగిన అవినీతి విచారణ నిర్వహించడంతోపాటు అక్రమ రవాణా అరికడతామన్నారు. అసంపూర్తిగా ఉన్న ఫ్లైఓవర్ నిర్మాణాన్ని పూర్తి చేయిస్తానన్నారు. గూడూరు చెరువును ఆధునికీకరిచడంతోపాటు కట్టపై వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. పట్టణ పరిధిలోని, మండలాల్లోని సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామన్నారు. పార్టీ కార్యాలయంలో కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని నియోజకవర్గ పరిధిలో ఎవరికైనా సమస్యలుంటే సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

తన విజయానికి కృషి చేసిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఎస్.కిరణ్‌కుమార్, ఎన్.భాస్కర్‌రెడ్డి, పి.శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, ఆరికట్ల మస్తాన్ నాయుడు, బి.చెంచురామయ్య, వి.శివకుమార్, పి.నాగరాజు, ఎం.శ్రావణి, జి.లీలావతి, పెంచలయ్య, వెంకటేశ్వర్లురెడ్డి, సర్వోత్తమరెడ్డి, జలీల్‌అహ్మద్, కిషోర్‌నాయుడు, మధుసూదన రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వెంకటగిరి, జూన్ 7: పట్టణంలోని పాలకేంద్రం వద్ద ఉన్న 132 కేవీ సబ్ స్టేషన్‌లో మర్మతులక కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో డీఈఈ మునిరవిచంద్ర తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని వెంకటగిరి పట్టణం సహా మండలం, డక్కిలి, బాలాయపల్లి మండలాల విద్యుత్ వినియోగదారులు, రైతులు సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

గత ఎన్నికలతో పోలిస్తే

నోటాకు, కాంగ్రెస్‌కు పెరిగిన ఓట్లు

గూడూరు అర్బన్, జూన్ 7: గత ఎన్నికలతో పోలిస్తే గూడూరు నియోజకవర్గ పరిధిలో నోటాకు, కాంగ్రెస్‌కు ఈ దఫా ఓట్ల సంఖ్య పెరిగింది. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి నియోజకవర్గంలో 1,234 ఓట్లు వచ్చాయి. 2024 సార్వత్రిక ఎన్నికల్లో పోస్టల్‌బ్యాలెట్‌తో కలిపి 3,308 ఓట్లు పోలయ్యాయి. దీంతో గత ఎన్నికలతో పోలిస్తే ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీకి 2,074 ఓట్లు అధికంగా వచ్చాయి. అదేవిధంగా 2019 ఎన్నికల్లో నోటాకి 2,885 ఓట్లు పోలయ్యాయి. ఈ ఎన్నికల్లో నోటాకు పోస్టల్ బ్యాలెట్‌తో కలిపి 3,129 ఓట్లు నమోదయ్యాయి. గత ఎన్నికలతో పోలిస్తే నోటాకు 244 ఓట్లు అధికంగా వచ్చాయి.

సూళ్లూరుపేటలో కాంగ్రెస్‌కు ఓట్లు పెరిగాయోచ్!

తడ, జూన్ 7 : ఒకప్పుడు అటు రాష్ట్రాన్ని... ఇటు దేశాన్ని ఏకచ్ఛత్రాధిపత్యంగా ఏలిన కాంగ్రెస్.. 2014 నుంచి గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటుంది. కారణం ఉమ్మడి రాష్ట్రాన్ని విడగొట్టిందన్న అపవాదుతో ప్రజలు ఆ పార్టీకి పూర్తిగా దూరమయ్యారు. లక్షల సంఖ్యలో ఉన్న ఓటర్లు కాస్తా వందల సంఖ్యలోకి జారి పోయారు. ఆ పార్టీపై కనీస సానుభూతి కరువైంది. 2014 ఎన్నికల్లో ఆ పార్టీ నుంచి పోటీ చేసిన డి.మధుసూదన్‌రావుకు కేవలం 2,798 ఓట్లు మాత్రమే పోలైనాయి. అప్పటి నుంచి సంస్థాగతంగా ఆ పార్టీ బలపడలేక పోతోంది. 2019 ఎన్నికల్లో ఆ ఓట్ల సంఖ్య ఇంకొంచం తగ్గింది. అప్పట్లో ఆ పార్టీ తరపున పోటీ చేసిన కె.ఈశ్వరయ్యకు 2,698 ఓట్లు మాత్రమే పోలవడంతో ఇక కాంగ్రెస్‌పార్టీకి ఆంధ్రరాష్ట్రంలో స్థానం లేదన్న వాదన వినిపించింది. ఈ క్రమంలో 2024 ఎన్నికల్లో అనూహ్యంగా ఆ పార్టీకి ఓట్లు పెరిగాయి. ఈ ఎన్నికల్లో ఆ పార్టీ నుంచి పోటీ చేసిన కె.శివకు 4,124 ఓట్లు పోలయ్యాయి. ఈ దశాబ్దంలో రెండు ఎన్నికలు జరిగిన తరువాత ఇప్పుడు కొద్దోగొప్పో ఆ పార్టీకి ఓట్లు పెరిగాయోచ్ అంటూ కొందరు మాట్లాడుకోవడం కన్పించింది. అందుకు ప్రస్తుతం రాష్ట్ర పీసీసీ సారథి షర్మిల చరిష్మ కారణమని రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ బలం పుంజుకోవడం ఖాయమని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు.

శాంతిభద్రతలకు ప్రజలు సహకరించాలి

గూడూరు, జూన్ 7: డివిజన్ పరిధిలోని ప్రజలు ఎన్నికలు పూర్తయిన నేపథ్యంలో ఏలాంటి హింసాత్మక ఘటనలకు పాల్పడకుండా పోలీసులకు సహకరించాలని డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి శుక్రవారం పేర్కొన్నారు. అనవసరైన ఆవేశాలు, భావోద్వేగాలతో హింసాత్మక ఘటనలకు పాల్పడకూడదన్నారు. శాంతియుత వాతావరణానికి భంగం కలిగించకుండా నడుచు కోవాలన్నారు. చట్టపరిధిలో సమస్యకు పరిష్కార మార్గాలను చూడాల న్నారు. ఎవరైనా రౌడీయిజం, దౌర్జన్యాలకు వాటికి పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు.

మొక్కలు నాటేందుకు స్థలం చూపాలంటూ వినతి

తడ, జూన్ 7: మండలంలో సుమారు 1.50 లక్షల మొక్కలు నాటేందుకు స్థలం చూపాల్సిందిగా సైన్స్ ఆఫ్ ఇండియా పత్రిక రెవెన్యూ అధికారులను కోరింది. గత నెల 29వ తేదీ ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందింది. దీంతో ఆయన తడ తహసీల్దారుకు ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించాల్సిందిగా ఆదేశించారు. ఆదేశాల మేరకు తడకండ్రిగ పంచాయతీ సర్వేనెం.213లో 192 ఎకరాల దయాళ్ భూములను గుర్తించామని తహసీల్దారు సయ్యద్ ఇక్బాల్ తెలిపారు. దానిపై సర్వే నిర్వహించామని మొక్కలు సరఫరా చేసే సదరు సంస్థకు ఆ వివరాలు తెలిపామని ఆయన శుక్రవారం తెలిపారు. దానిపై సదరు సంస్థ ప్రతినిధులు త్వరలోనే స్థల పరిశీలనకు వస్తారన్నారు.

కారు బోల్తా: ఒకరికి స్వల్ప గాయాలు

నాయుడుపేట టౌన్, జూన్ 7: నాయుడుపేట - నరసారెడ్డికండ్రిగ జాతీయ రహదారి కూడలి వద్ద కారు బోల్తా పడిన ఘటనలో వృద్ధురాలు స్వల్పంగా గాయపడ్డారు. నాయుడుపేట పట్టణానికి చెందిన న్యాయవాది పసల చెంగయ్య శుక్రవారం రాత్రి తన కుటుంబీకులతో కలసి కారులో నెల్లూరుకు వెళ్లి తిరిగి వస్తుండగా నరసారెడ్డికండ్రిగ కూడలి వద్ద మలుపు తిరుగుతుండగా చెన్నై నుంచి నెల్లూరు వెళ్తున్న కారు ఢీ కొనింది. ఈ ఘటనలో కారు రోడ్డు పక్కన ఉన్న తూములో పడిపోయింది. గమనించిన స్థానికులు కారులో ప్రయాణిస్తున్న వారిని వెలికి తీశారు. వారిలో ఓ వృద్ధురాలికి మాత్రమే గాయాలయ్యాయి.

నేడు సీతారాముల కల్యాణం

కోట, జూన్ 7: పట్టణ పరిధిలోని శ్యామసుందరపురంలో అభయాంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 8న ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు జరగనున్నాయి. ఆలయ ధర్మకర్తల ఆధ్వర్యంలో ఉదయం ఆలయ ప్రాంగణంలో భజన కార్యక్రమాలుంటాయి. అదే విధంగా శ్రీసీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో అభయాంజనేయ స్వామి చిత్రపటంతో శ్యామసుందరపురంలో గ్రామోత్సవం జరగనుంది. ఆయా గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు అన్నదానం చేస్తారు. ఈ సందర్భంగా సీతారాముల కల్యాణాన్ని నిర్వహించనున్నారు.

కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలు







ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్ద , వినాయకుడి గుడి వద్ద , జీఎన్‌టీ రోడ్డు చర్చి వద్ద వ్యర్థాలతో నిండిన మురుగుకాలువ

సూళ్లూరుపేట, జూన్ 7: అంతర్జాతీయంగా పేరు గాంచిన షార్ కేంద్రం పక్కనే ఉన్న సూళ్లూరుపేట పట్టణం కనీసం మురుగునీరు పారుదలకు సరైన కాలువలు లేక పలుచోట్ల రోడ్లపై ప్రవహిస్తున్నాయి. ప్రధాన కూడళ్లలో, బజారు వీధుల్లో మురుగునీటిలో నడిచి పోవాల్సి వస్తోంది. గడిచిన ఐదేళ్లలో పాలకులు పట్టించుకున్న పాపానపోలేదు. పన్నుల రూపంలో వేలాది రూపాయలు వసూలు చేస్తున్నా ప్రజలకు సౌకర్యాల కల్పనలో మున్సిపాలిటీ అధికారులు విఫలమవుతున్నారు. పట్టణంలోని జీఎన్‌టీ రోడ్డులో, ఆర్టీసీ బస్టాండు సమీపం, పోలీస్‌స్టేషన్ పక్కన, ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్ద మురుగుకాలువలు చెత్తాచెదారాలతో నిండి చిన్న పాటి వర్షమొచ్చినా మురుగు రోడ్లపై పారుతోంది. హోలిక్రాస్ సర్కిల్, గాండ్ల వీధి సచివాలయం వద్ద, ప్రభుత్వ ఆస్పత్రి రోడ్డు ఎదురుగా కాలువల్లో నుంచి పొంగిన మురుగు నిలిచిపోవడంతో వాహన చోదకులు, పాదచారులు, స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎక్కడ చూసినా కాలువల్లో ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లతో పాటు వ్యర్థాలు పేరుకుపోయి ఉన్నాయి. సైడ్ కాలువల్లో మున్సిపాలిటీ పారిశుధ్య సిబ్బంది పూడిక తీయడం లేదు. బుధవారం కురిసిన వర్షానికి రోడ్ల పైకి వర్షపు నీరు చేరింది. మున్సిపాలిటీ పారిశుధ్య సిబ్బంది స్పందించి మురుగు కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి పూడిపోయిన చోట పూడిక పనులు చేయించి మురుగునీరు రోడ్లపైకి ప్రవహించకుండా చూడాలని పట్టణవాసులు కోరుతున్నారు.



గాండ్లవీధి సచివాలయం వద్ద రోడ్డుపై మురుగునీరు

జీవో 117ను రద్దు చేయాలి: యూటీఎఫ్



సభలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

గూడూరు, జూన్ 7: జీవో 117ను రద్దు చేయాలని యూటీఎఫ్ ఆధ్వర్యంలో నూతన ప్రభుత్వానికి విన్నవిస్తున్నట్లు యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు శ్రీనివాసరావు చెప్పారు. శుక్రవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల వ్యవస్థను కొనసాగించాలన్నారు. పాఠశాలల విలీనాన్ని రద్దు చేయాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. విద్యార్థులకు మాధ్యమాన్ని ఎంచుకునే సౌలభ్యం కల్పించాలన్నారు. మెగా డీఎస్సీ ద్వారా ఖాళీలను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు, రాజశేఖర్, సూర్యప్రకాష్, శేఖర్, శ్రీదేవి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

నిఘా నీడనే గ్రామాలు

కోట, జూన్ 7 : మండలంలోని పలు సమస్యాత్మక గ్రామాలు ఇప్పటికీ నిఘా నీడలోనే ఉన్నాయి. ఈ మేరకు ఆయా సమస్యాత్మక గ్రామాలపై డేగకన్ను వేసినట్లు ఎస్ఐ నాగబాబు శుక్రవారం తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వాకాడు సీఐ హరికృష్ణ పర్యవేక్షణలో ఎస్ఐ నాగబాబు ఆధ్వర్యంలో అత్యంత సమస్యాత్మక పంచాయతీలైన కొత్తపట్నం, కోట, కేశవరంలో పోలీస్ పికెట్ ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. కేశవరం పంచాయతీలో ఎక్కువమందిపై రౌడీషీట్లు ఓపెన్ చేసి ఉండటంతో నిఘా పటిష్ఠ పరుస్తున్నారు. మద్దాలి, చిట్టేడు, వెంకన్నపాళెం, నెల్లూరుపల్లి కొత్తపాళెంలల్లో నిఘా కొనసాగుతోంది.

ఎస్వీయూలో అక్రమాలపై

న్యాయ విచారణ చేపట్టాలి

తిరుపతి అర్బన్, జూన్ 7: ఎస్వీయూలో ఐదేళ్లుగా జరిగిన అక్రమ నియామకాలు, పదోన్నతులు, నిధుల దుర్వినియోగంపై న్యాయ విచారణ జరిపించాలని తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాగల ఆనంద్ గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఎస్వీయూ రెక్టార్‌గా, వీసీగా ఉన్న సమయంలో ప్రొఫెసర్ శ్రీకాంత్‌రెడ్డి ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారని, పాలకమండలి నిర్ణయాలను తుంగలో తొక్కారని విమర్శించారు. ఆయనపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్వీయూ అక్రమాలకు సంబంధించి గవర్నర్‌కు లేఖ రాశామని గుర్తుచేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని లెక్కచేయక నియామకాలు చేపట్టారని, రుసా నిధులు కూడా దుర్వినియోగం చేయడం దారుణమన్నారు. తెలుగుయువత్ రాష్ట్ర అధికార ప్రతినిధి శేషాద్రినాయుడు, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోండి: సీఆర్‌ఎస్‌ఓ



రేణిగుంటలో అధికారులతో చర్చిస్తున్న సీఆర్‌ఎస్‌ఓ మాధవి

తిరుపతి(ఆటోనగర్), జూన్ 7: రైలు ప్రమాదాలు జరగకుండా అధికారులు పటిష్ఠమైన జాగ్రత్తలు తీసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ రైల్వే సేఫ్టీ ఆఫీసర్ మాధవి ఆదేశించారు. రేణిగుంట- కాట్పాడి రైల్వే జంక్షన్ల మధ్య రైలు మార్గం తనిఖీల్లో భాగంగా శుక్రవారం రేణిగుంట రైల్వే జంక్షన్‌లోని కీలకమైన విభాగాలు పరిశీలించారు. ప్రధానంగా లోకో పైలట్లు, గార్డులకు విధులు కేటాయించే విభాగంలో రికార్డులు తనిఖీ చేశారు. ఇటీవల యార్డులో జరిగిన ప్రమాదాలను అడిగి తెలుసుకున్నా రు. గూడ్స్ రైళ్ల పట్టాలు తప్పిన సంఘటనలపైనా ఆరా తీశారు. అనంతరం స్టేషన్ మాస్టర్ల విభాగాన్ని తనిఖీ చేశారు. గుంతకల్లు డివిజన్ ఏడీఆర్ఎం సుధాకర్, సీనియర్ స్కేల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మారెడ్డికి దండన తప్పదు: టీడీపీ



మీడియాతో మాట్లాడుతున్న ఇనుకొండ సుబ్రహ్మణ్యం

తిరుపతి అర్బన్, జూన్ 7: టీటీడీని అప్రతిష్ఠపాలు చేసిన ఈవో ధర్మారెడ్డికి శిక్ష తప్పదని టీడీపీ నేత ఇనుకొండ సుబ్రహ్మణ్యం జోస్యం చెప్పారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఈవో, ఆయన అనుచర ఉద్యోగులు లెక్కలేనన్ని పాపాలు చేశారన్నారు. అక్రమాలకు పాల్పడి.. తిరుమలను అపవిత్రం చేశారన్నారు. కల్యాణకట్టలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్‌ను స్థాపించి క్షురకుల నుంచి ముడుపులు వసూలు చేశారన్నారు. ఈ విషయాన్ని ఈవో పట్టించుకోలేదని, అమాయకపు క్షురకులను మాత్రం వేధించేవారన్నారు. టీటీడీ ఉద్యోగుల ఇళ్ల స్థలాల్లోనూ రోజాకు వాటా ఉందన్నారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ దోచేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందువల్లే ప్రజలు సరైన సమాధానం ఇచ్చారన్నారు.

మురుగునీరు కదలక అవస్థలు

చిల్లకూరు, జూన్ 7: డ్రైనేజీ కాలువల్లో పెరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించకపోవడంతో మురుగు కదలక చిల్లకూరువాసులు ఇబ్బంది పడుతున్నారు. నెల రోజుల క్రితం తొలగించిన చెత్తాచెదారాన్ని కాలువ పక్క నుంచి తొలగించపోవడంతో తిరిగి వాటిల్లోనే పడడంతో ఈ పరిస్థితి తలెత్తిందని స్థానికులు చెబుతున్నారు.ప్రధానంగా వడ్డిపాళెంలో మురుగునీటి కాలువల్లో చెత్తాచెదారం తొలగించక పోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం కురిస్తే వాననీటితోపాటు మురుగు రోడ్లపై పారుతోందంటున్నారు. వర్షానికి కాలువల్లో మురుగు కదలక పోవడంతో స్థానికులే శుభ్రం చేసుకున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించాల్సి ఉందని స్థానికులు కోరుతున్నారు.



వడ్డిపాళెంలో సిమెంటురోడ్డుపై నిలిచివున్న మురుగు

ఎన్డీఏ కూటమిలో బీసీలకు పెద్దపీట

ఏఎంసీ మాజీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి



విజయభాస్కర్‌రెడ్డిని సన్మానిస్తున్న బీసీ సంఘ నాయకులు

నాయుడుపేట టౌన్, జూన్ 7: ఎన్డీఏ కూటమిలో వెనుకబడిన తరగతుల వారికి పెద్దపీట వేయనున్నారని ఏఎంసీ మాజీ చైర్మన్ ఎస్.విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. నాయుడుపేటలో శుక్రవారం విజయభాస్కర్‌రెడ్డిని సీమాంధ్ర బీసీ సంఘ సూళ్లూరుపేట నియోజకవర్గ అధ్యక్షుడు జి.మస్తాన్ సన్మానించారు. ఈ సందర్భంగా విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ... సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన బీసీలకు టీడీపీ ప్రభుత్వంలో ఆదరణ పథకం ద్వారా వివిధ రకాల వృత్తిదారులకు వారికి అవసరమైన పనిముట్లను అందజేసిందన్నారు. అలాగే బీసీ కార్పొరేషన్ ద్వారా రూ.2 లక్షలు రుణంలో లక్ష రూపాయలు రాయితీ అందించిందని గుర్తు చేశారు. బీసీ సంఘ నాయకులు ప్రతాప్, రామయ్య, వినోద్, ప్రసాద్, శేఖర్, శివ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లకూరు: మండలంలోని శిరసనంబేడులో శుక్రవారం టీడీపీ యువ నాయకుడు వి.కల్యాణ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్డీఏ భారీ మెజార్టీ రావడంపై సంబరాలు జరిపారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ భర్త పార్థసారథిని సత్కరించారు. అనంతరం కేక్‌ను కట్‌చేసి టీడీపీ నాయకులకు, అభిమానులకు పంచిపెట్టారు. సురేష్‌రెడ్డి, కె.సునీల్, సిసింద్రి, సునీల్ పాల్గొన్నారు.

నారా లోకేశ్‌కు ముక్కంటి ప్రసాదాలు


లోకేశ్‌ను సన్మానిస్తున్న సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, జూన్ 7: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను శుక్రవారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యేగా ఎన్నికైన బొజ్జల సుధీర్‌రెడ్డి మంగళగిరిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను ముక్కంటి శేషవస్త్రంతో సన్మానించి, స్వామి అమ్మవార్ల తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మంచి మెజార్టీ సాధించిన సుధీర్‌రెడ్డిని లోకేశ్ అభినందించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అనంతరం యువ ఎమ్మెల్యేలు అందరూ కలిశారు.

శభాష్ ఆదిమూలం



పిచ్చాటూరు, జూన్ 7: గెలవడం అసాధ్యం అన్నారంతా... దాన్ని తలకిందులు చేస్తూ నీ రాజకీయ చతురతతో అందరినీ కలుపుకుని పోయి సుసాధ్యం చేసుకున్నావని టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలాన్ని అభినందించారు. శుక్రవారం మంగళగిరి పార్టీ కార్యాలయంలో చంద్రబాబును సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చంద్రబాబుతో మాట్లాడుతూ మీ నమ్మకాన్ని నిలబెట్టుకున్నాను అన్నా అంటూ పుష్పగుచ్ఛం ఇచ్చి కాబోయే ముఖ్యమంత్రికి అభినందనలు తెలిపారు.

నాన్ రెసిడెంట్ ఓటర్లకు ధన్యవాదాలు


లోకేష్‌బాబుతో కోటపాటి మురళి

శ్రీకాళహస్తి, జూన్ 7: నాన్ రెసిడెంట్ ఓటర్లకు ఎన్ఆర్‌వీ స్టేట్ ఇన్‌ఛార్జి కోటపాటి మురళి ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ బెంగళూరు, హైదరాబాద్ నుంచి ఆంధ్రాకు వెళ్లి ఓటు వేయడానికి నాన్ రెసిడెంట్ ఓటర్లకు బస్సు సౌకర్యం కల్పించడం సంతోషకరమన్నారు. ఎన్ఆర్ఐ, ఎన్ఆర్‌వీ ఓటర్లు కష్టపడి వేరే రాష్ట్రాలు, విదేశాలనుంచి వచ్చి మన భవిష్యత్తు తరాల కోసం ఓట్లు వేశారన్నారు. వారికి కృతజ్ఞతలు తెలిపారు. తనను ప్రోత్సహించిన చంద్రబాబు, లోకేశ్, బొజ్జల సుధీర్‌రెడ్డి తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

నితిన్ గడ్కరీని కలిసిన కోలా ఆనంద్



శ్రీకాళహస్తి, జూన్ 7: బీజేపీ సీనియర్ నేత నితిన్ గడ్కరీని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ శుక్రవారం ఢిల్లీలోని ఆయన నివాస గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నితిన్ గడ్కరీని ముక్కంటి శేషవస్త్రంతో సన్మానించి, స్వామి అమ్మవార్ల తీర్థప్రసాదాలు అందజేశారు.

సత్రవాడ ప్రవీణ్‌కు పలువురి శుభాకాంక్షలు


ప్రవీణ్‌ను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు

శ్రీకాళహస్తి, జూన్ 7: శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే సత్రవాడ మునిరామయ్య కుమారుడు సత్రవాడ ప్రవీణ్ జన్మదినం సందర్భంగా శుక్రవారం పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఉదయం శ్రీకాళహస్తీశ్వరస్వామి అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం శ్రీరామ్‌నగర్‌కాలనీలో అభిమానులు ఏర్పాటు చేసిన కేక్ కట్ చేశారు. మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు తన ఇంటి వద్ద ప్రవీణ్‌ను పూలమాలలు, దుశ్శాలువాతో సత్కరించి, ఆశీర్వదించారు. ఊరందూరులో బొజ్జల బృందమ్మను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. టీడీపీ నాయకులు ఎస్సీవీ దిలీప్ నాయుడు, ఎస్సీవీ కిరణ్ నాయుడు, హరి నాయుడు, వినయ్, భాస్కర్ నాయుడు, నారాయణయాదవ్, ధనంజయులు నాయుడు, ప్రభాకర్ నాయుడు, సుదర్శన్ నాయుడు, మునిశేఖర్‌గౌడ్, చందు, గణేష్, లీలామోహన్ పాల్గొన్నారు.

వైసీపీ కవ్వింపు చర్యలు

వరదయ్యపాళెం, జూన్ 7: వరదయ్యపాళెం మండలం తొండంబట్టు పంచాయతీ నాగనందాపురం గ్రామంలో ఎన్నికల అనంతరం శుక్రవారం టీడీపీ, జనసేన నాయకులపై వైసీపీ కవ్వింపు చర్యలకు పాల్పడింది. దీంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న తహసీల్దారు ఉదయభారతి, పోలీసులు అక్కడికి చేరుకున్నారు. మూడు పార్టీల నాయకులను బైండోవర్ చేశారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

ఘనంగా శుక్రవార ఉత్సవం


అమ్మవారి ప్రాకార ఉత్సవం

శ్రీకాళహస్తి, జూన్ 7: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం పురస్కరించుకుని అమ్మవారికి విశేష ఉత్సవం నిర్వహించారు. అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబిక అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

దుష్టపాలన అంతమైంది


అన్నదానం చేస్తున్న బొజ్జల బృందమ్మ

శ్రీకాళహస్తి, జూన్ 7: ఆంధ్రప్రదేశ్‌లో దుష్టపాలన అంతమైందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ అన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి శుక్రవారం పూలమాల వేసి నివాళులు అర్పించారు. పేదలకు అన్నదానం చేశారు. టీడీపీ నాయకులు విజయకుమార్, కంఠా రమేష్, చెంచయ్య నాయుడు, కరీంబాయ్, వెంకటేష్ చౌదరి పాల్గొన్నారు.

సురేష్ పిళ్లై నవలకు రెడ్డెమ్మ పురస్కారం

● 12న చిత్తూరులో బహుమతుల కార్యక్రమం


కేపీ మునిసురేష్ పిళ్లై

చిత్తూరు కల్చరల్, జూన్ 7: చిత్తూరు నగరంలోని రాజామహల్ హోటల్‌లో ఈనెల 12న కుప్పం రెడ్డెమ్మ జాతీయస్థాయి సాహితి పురస్కారాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ కె. రామలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోహిణి పంజారి రచించిన 'నల్లసూరీడు', డాక్టర్ ఎం.సుగణరావు రచించిన 'సుగుణ కథాభిరామం' కథలు బహుమతులకు ఎంపికయ్యాయని తెలిపారు. అలాగే శ్రీకాళహస్తికి చెందిన రచయిత కె.ఎ.మునిసురేష్ పిళ్లై రచించిన 'పుత్రిక శత్రు', సి.కాశిపురం ప్రభాకర్‌రెడ్డి రచించిన 'మేడం' నవలకు బహుమతులు లభించినట్లు వివరించారు.

మొక్కల పంపిణీ

వరదయ్యపాళెం, జూన్ 7: సత్యవేడు మాజీ ఎమ్మెల్యే సి.దాస్ జయంతిని పురస్కరించుకుని వరదయ్యపాళెం బస్టాండు ఆవరణంలో నాగార్జున, యువరాజ్, మునిచంద్ర, చెంగయ్య ఆధ్వర్యంలో శుక్రవారం పలువురికి మొక్కలను పంపిణీ చేశారు. వరదయ్యపాళెం ఆరోగ్య కేంద్రానికి వచ్చిన వారికి డాక్టర్ ఉదయ్‌కుమార్ బిస్కెట్లను అందజేశారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో బందోబస్తు

తారకరామనగర్, జూన్ 7: రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ తారకరామనగర్‌లో డీఎస్పీ ఉత్తర్వుల మేరకు సీఐ మల్లికార్జున తన సిబ్బందితో శుక్రవారం బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికల ఫలితాల అనంతరం గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఆదిమూలం గెలుపుపై సంబరాలు

కేవీబీపురం, జూన్ 7: మండలంలోని ఓళ్యూరు గ్రామంలో శుక్రవారం టీడీపీ సర్పంచ్ సురేష్ ఆధ్వర్యంలో సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం గెలుపుపై రాములవారి ఆలయంలో మొక్కులు చెల్లించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

17 నుంచి ప్రసన్న వెంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

వడమాలపేట, జూన్ 7: అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 17 నుంచి 25వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు.ఈ నెల 11వ తేది మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 16న ఆదివారం సాయంత్రం అంకురార్పణ నిర్వహించనున్నారు.

ముక్కంటి ఆలయంలో అంతర్గత బదిలీలు

శ్రీకాళహస్తి, జూన్ 7: ముక్కంటి ఆలయంలో 12మంది అధికారులు, ఉద్యోగులను పలు విభాగాలకు అంతర్గత బదిలీ చేశారు. పరిపాలన సౌలభ్యం కోసం తరచూ ఉద్యోగులను ఒక విభాగం నుంచి మరో విభాగానికి మారుస్తుంటారు. కొద్ది సంవత్సరాలుగా వైసీపీ నాయకులతో అత్యంత సన్నిహితులుగా ఉంటూ తిష్టవేసుకున్న పలువురిని బదిలీ చేశారు. ఇందులో భాగంగా ఈవో సీసీగా ఉన్న ఒప్పంద ఉద్యోగి హరికృష్ణను పబ్లికేషన్ స్టాల్‌కు, అధికారులు కృష్ణారెడ్డిని గోశాల నుంచి వెండి నాగపడగలు తయారు చేసే కేంద్రానికి, లోకేష్‌బాబును మింట్ నుంచి ప్రధాన ఆలయానికి, ధనపాల్‌ను ప్రధాన ఆలయం నుంచి గోశాలకు, భూముల సంబంధిత విభాగంలో పనిచేస్తున్న ప్రదీప్‌రెడ్డిని ఈవో సీసీగా నియమించారు. జూనియర్ అసిస్టెంట్ అన్వేష్‌కు స్కిట్ నర్సింగ్ కళాశాలలో భూముల విభాగం అదనపు బాధ్యతలు అప్పగించారు. జూనియర్ అసిస్టెంట్ మహేష్‌ను ఇన్‌కంట్యాక్స్ విధులతో పాటు క్యాషియర్‌గా అదనపు బాధ్యత, ఒప్పంద ఉద్యోగి అనిల్‌బాబును స్వామివారి సన్నిధి నుంచి భరద్వాజతీర్థంలో వాచ్ అండ్ వార్డుగా, పాలకమండలి అటెండర్‌గా పనిచేస్తున్న మయూర్‌కుమార్‌ను స్టేషనరీ విభాగానికి, రూ.500 రాహుకేతు మండపంలో పనిచేస్తున్న సుధీర్‌ను రైల్వేస్టేషన్‌లోని సమాచార కేంద్రానికి, పొరుగుసేవల ఉద్యోగి కిరణ్ కుమార్‌ను పబ్లికేషన్ స్టాల్ నుంచి వీఐపీలాంజ్‌కు బదిలీ చేశారు. ఈ మేరకు ఈవో నాగేశ్వరరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

బీజేపీ సంబరాలు



శ్రీకాళహస్తి, జూన్ 7: బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ సూచనలతో శుక్రవారం ఆ పార్టీ నాయకులు కార్యాలయం వద్ద ఘనంగా విజయోత్సవ సంబరాలు చేసుకున్నారు. బాణసంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. పార్టీ అసెంబ్లీ కో కన్వీనర్ మేళాగరం సుబ్రహ్మణ్యంరెడ్డి, బీజేపీ నాయకులు ఎస్వీ రమణ, కొండేటి గోపాల్, ప్రజ్ఞశ్రీ, గోపాల్, కిరణ్, మణి, అమర్‌నాథ్, కన్నా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకులో అప్పుందని పింఛను ఇవ్వలేదు

● వృద్ధురాలి ఆవేదన


పింఛను కోసం బ్యాంకు దగ్గర వేచి ఉన్న వృద్ధురాలు

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 7: బ్యాంకులో అప్పు ఉందని బ్యాంకు అధికారులు తనకు పింఛన్ ఇవ్వలేదని వృద్ధురాలు వజ్రమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆమె బ్యాంకు వద్ద మీడియాతో మాట్లాడుతూ.. తన పేరుతో ఉన్న భూమిపై తన ఇద్దరు కుమారులు సప్తగిరి గ్రామీణ బ్యాంకులో క్రాప్‌లోన్ తీసుకున్నారని తెలిపారు. వారు లోన్ చెల్లించనందున ప్రభుత్వం తనకు మంజూరు చేసిన పింఛన్‌ను బ్యాంకు అధికారులు ఇవ్వలేదన్నారు. తన కుమారులు చూడకపోవడంతో తాను పింఛన్ డబ్బులతో జీవితం గడుపుతున్నట్లు తెలిపారు. అధికారులు తనకు పింఛన్ ఇప్పించాలని ఆమె కోరుతున్నారు. బ్యాంకు అధికారులు వృద్ధుల పింఛన్ నగదును బాకీ పేరుతో నిలుపుదల చేయడం దారుణమని సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య ఖండించారు. ఈ విషయంపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ఇసుక రవాణాను అడ్డుకున్న టీడీపీ

● పోలీసులకు ఇసుక ట్రాక్టర్ల అప్పగింత


టీడీపీ నాయకులు ఆపేసిన ఇసుక ట్రాక్టర్

ఏర్పేడు, జూన్ 7: ఏర్పేడు మండలం మునగలపాళెం, వికృతమాల సరిహద్దులో శుక్రవారం ఉదయం ఇసుకను ట్రాక్టర్ల ద్వారా కొంతమంది అక్రమ రవాణా చేస్తున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన స్థానిక టీడీపీ నేతలు సతీష్ నాయుడు, జనార్ధన్, హేమాక్షి తదితరులు స్వర్ణముఖి ప్రాంతానికి వెళ్లి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్నారు. ఈ క్రమంలో రెండు ట్రాక్టర్లు తప్పించుకున్నాయి. మిగిలిన ఒక ట్రాక్టరును అడ్డుకుని పోలీసులకు అప్పగించారు. వికృతమాల గ్రామానికి చెందిన వైసీపీ నేత ఒకరు ఇసుక తరలించడంతో ఆయనపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నేత సతీష్ నాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా ఇసుకను తరలించి సొమ్ము చేసుకున్న వారంతా ఇక ఇసుక అక్రమ రవాణాకు స్వస్తి చెప్పాలన్నారు. ఇకపై టీడీపీ ప్రభుత్వం సహించదని హెచ్చరించారు.

టీడీపీ మండలాధ్యక్షుడికి సన్మానం



కేవీబీపురం, జూన్ 7: ఎన్నికల్లో టీడీపీ గెలుపుపై హర్షం వ్యక్తం చేస్తూ మండలంలోని శ్రీనివాసపురం గ్రామస్తులు మండల టీడీపీ అధ్యక్షుడు రామాంజుల నాయుడును శుక్రవారం సన్మానించారు. అధికారం ఉన్నా లేకపోయినా మండలంలో అందరినీ కలుపుకుపోయి టీడీపీ విజయానికి కృషి చేశారని ఆయనను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో బాబు, మాజీ సర్పంచ్ మునస్వామి, దొరవేలు, వెంకటయ్య, అర్జునయ్య తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాల నిలయంలో ఫొటోల తొలగింపు


ఫొటోలను తొలగిస్తున్న పురపాలక సిబ్బంది

శ్రీకాళహస్తి, జూన్ 7: వైసీపీ నాయకులు నిర్మించిన నవరత్నాల నిలయం భవనంలో రాజకీయ నాయకుల చిత్రాలను శుక్రవారం పురపాలక సిబ్బంది తొలగించారు. శ్రీకాళహస్తి పట్టణ శివారు రాజీవ్‌నగర్ కాలనీ వద్ద ప్రభుత్వ భూమిలో వైసీపీ నేతలు నవరత్నాల నిలయం పేరుతో భవనాన్ని నిర్మించారు. అందులో నవరత్న పథకాలకు సంబంధించిన చిత్రపటాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూమిలో నవరత్నాల నిలయం ఉండటం.. అందులో రాజకీయ చిత్రాలు ఉండటంతో సమస్యలు ఉత్పన్నమవుతాయని అధికారులు భావించారు. ముందస్తు చర్యలుగా నవరత్నాల నిలయంలోని పలు చిత్రపటాలను తొలగించి భద్రపరిచారు.

కరకంబాడి పంచాయతీ కార్యాలయంలో రూ.2కోట్ల పనులకు ఆగిన ఆడిటింగ్

● రికార్డులు ఇవ్వకుండా వెళ్లిన పాత కార్యదర్శి
● నోటీసులు జారీ చేసినా స్పందించని అధికారి

రేణిగుంట, జూన్ 7: రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీలో 2022-2023 సంవత్సరానికి రూ.2 కోట్ల నిధులతో చేసిన అభివృద్ధి పనులకు సరైన రికార్డులు, బిల్లులు, ఎంబుక్, స్టాక్ రిజిస్టర్, ఓచర్స్ సమర్పించకపోవడంతో ఆడిటింగ్ శాఖ అభ్యంతరాలు తెలుపుతూ మాజీ కార్యదర్శికి నోటీసులు జారీ చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. 2022-2023 సంవత్సరంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో కరకంబాడి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించిన రామాంజనేయులురెడ్డి పంచాయతీ పరిధిలో రూ.2కోట్లు ఖర్చు చేసి వివిధ అభివృద్ధి పనులు చేయించారు. జరిగిన పనులకు సంబంధించి రికార్డులు సమర్పించాలని ఆడిటింగ్ శాఖ అధికారులు పంచాయతీ కార్యదర్శికి నోటీసులు జారీ చేస్తూ జిల్లా పంచాయతీ అధికారికి కూడా సమాచారం ఇచ్చారు. ఈ విషయంపై ఇప్పటికే కార్యదర్శికి డీఎల్‌పీవో పలుమార్లు మెమోలు జారీ చేసినట్లు సమాచారం. దీనిపై కరకంబాడి ప్రస్తుత పంచాయతీ కార్యదర్శి యూసఫ్‌ఖాన్‌ను వివరణ కోరగా, 2022-23 సంవత్సరంలో జరిగిన అభివృద్ధి పనులపై రికార్డులు అందజేయాలని గతంలో ఇక్కడ పని చేసిన కార్యదర్శికి ఇప్పటికే పలుమార్లు డీఎల్‌పీవో, డీపీవో నోటీసులు జారీ చేసినా స్పందించలేదని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శ్రీకాళహస్తి, జూన్ 7: శ్రీకాళహస్తి సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తిరుపతి రూరల్ ఈఈ వాసురెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా 132 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో గల 33/11 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతులు, లైన్ల మరమ్మతులు చేస్తున్న కారణంగా ఉదయం 8.30గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు శ్రీకాళహస్తి పట్టణం, శ్రీకాళహస్తి రూరల్, కేవీబీపురం, బుచ్చినాయుడుకండ్రిగ, తొట్టంబేడు, ఏర్పేడు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

మొక్కులు తీర్చుకున్న టీడీపీ నాయకులు

నారాయణవనం, జూన్ 7: సత్యవేడు ఎమ్మెల్యేగా ఆదిమూలం గెలవడంతో శుక్రవారం మండల కేంద్రంలోని దుండి వినాయకస్వామి ఆలయంలో టీడీపీ నాయకులు 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. టీడీపీ నేత భాస్కరన్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆదిమూలం గెలుపుతో స్వామికి తలనీలాల సమర్పణ

పిచ్చాటూరు, జూన్ 7: పిచ్చాటూరు మండలం నీరువాయి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత కొణిదల ప్రకాష్ నాయుడు ఉమ్మడి అభ్యర్థి కోనేటి ఆదిమూలం విజయం సాధించడంతో శుక్రవారం తమ గ్రామంలో ఉన్న నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో తలనీలాలు సమర్పించారు. కార్యక్రమంలో సి.రుకేష్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కు చెల్లింపు

శ్రీకాళహస్తి, జూన్ 7: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యేగా బొజ్జల సుధీర్‌రెడ్డి గెలుపొందిన సందర్భంగా ఆ పార్టీ నేత వంకాయల సిద్ధులయ్య దంపతులు శుక్రవారం చిదంబర స్వామి ఆకాశలింగం, నటరాజ్‌స్వామి, అరుణాచల అగ్నిగిరిలింగం స్వామి సన్నిధిలో గిరి ప్రదక్షిణ చేసి మొక్కు చెల్లించుకున్నారు.

వరదయ్యపాళెం: రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు, సత్యవేడు ఎమ్మెల్యేగా కోనేటి ఆదిమూలం గెలిచిన నేపథ్యంలో టీడీపీ మండలాధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి శుక్రవారం తిరుమలకు కాలినడకన బయలుదేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శంకర్, ఇందిరానగర్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణపై శిక్షణా తరగతులు

శ్రీకాళహస్తి, జూన్ 7: శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోలో తిరుపతి డీపీటీవో ఆదేశాల మేరకు ప్రమాదాల నివారణపై శుక్రవారం డ్రైవర్లకు శిక్షణా తరగతులను నిర్వహించారు. డిపో మేనేజరు రాజవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కేఎంపీఎల్, ప్రమాదాల నివారణపై డ్రైవర్లకు పలుసూచనలు చేశారు.

ద్రౌపదీ ధర్మరాజులస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఏర్పేడు, జూన్ 7: ఏర్పేడు మండలం పాతవీరాపురం గ్రామంలో ద్రౌపతీ సమేత ధర్మరాజులస్వామి ఆలయంలో 50వ వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు పోతురాజు శ్రీకారం అనే కార్యక్రమంలో భాగంగా పోతురాజును ఊరేగింపుగా మాధవమాల, గుండ్రాళ్లమిట్ట, మల్లవరం, ఇసుకతాగేలి గ్రామాల్లోకి తీసుకెళ్లి ప్రత్యేకపూజలు నిర్వహించారు.

పుత్తూరు వార్తలు

నారా లోకేశ్‌ను కలిసిన భానుప్రకాష్



పుత్తూరు అర్బన్, జూన్ 7: నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ శుక్రవారం ఉండవల్లి నివాసంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టీడీపీ ఘన విజయం సాధించడం పట్ల నారా లోకేశ్‌కు భానుప్రకాష్ అభినందనలు తెలిపి దుశ్శాలువా, ఫ్లవర్ బొకేతో సత్కరించారు. నగరిలో చరిత్రాత్మక విజయం సాధించడం పట్ల భానుప్రకాష్‌ను లోకేశ్ అభినందించారు.

ఎమ్మెల్యే భానుప్రకాష్ గెలుపు చరిత్రాత్మకం


సమావేశంలో మాట్లాడుతున్న డీఎన్ ఏలుమలై

పుత్తూరు అర్బన్, జూన్ 7: నగరి ఎమ్మెల్యేగా గాలి భానుప్రకాష్ అఖండ మెజార్టీతో గెలవడం చరిత్రాత్మకమని మాజీ ఎంపీపీ డీఎన్ ఏలుమలై స్పష్టం చేశారు. శుక్రవారం బజారువీధిలో మున్సిపాలిటీకి చెందిన టీడీపీ నాయకులు విజయోత్సవ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లుగా నగరి నియోజకవర్గాన్ని దోచుకున్న మాజీ ఎమ్మెల్యే రోజాను, ఆమె కుటుంబాన్ని ప్రజలు తరిమికొట్టారని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సంక్షేమం, అభివృద్ధిపైన దృష్టి సారించనున్నారని, ప్రతి కుటుంబానికి అండగా ఉండనున్నారని చెప్పారు. మున్సిపల్ మాజీ చైర్మన్లు కరుణాకరన్, బీఆర్ యుగంధర్, అంకయ్య, మాజీ వైస్ చైర్మన్ డీఎస్ గణేష్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు షణ్ముగరెడ్డి ప్రసంగించారు. అనంతరం డీఎన్ ఏలుమలైను మొదలియార్ సామాజికవర్గం నాయకులు దుశ్శాలువా, పూలదండలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్, రవిశేఖర్‌రాజు, వీడీ అశోక్, డీజీ ధనపాల్, ఎంఎన్ఎం శ్రీరామ్, భాస్కర్‌రెడ్డి, లక్ష్మీపతి, బాబు నాయుడు, బాబూరామ్, వెంకటముని మేస్త్రి, శ్రీధర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

పుత్తూరు టౌన్, జూన్ 7: పుత్తూరు మండల పరిధిలోని చిన్నబ్బ నాయుడు కండ్రిగలో ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ వారిచే తిరుపతి వాసవీ ఐకేర్ సహకారంతో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించగా, విశ్రాంత ప్రభుత్వ వైద్యులు డాక్టర్ రవిరాజు ప్రారంభించారు. గ్రామంలోని ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, మందులు ఇచ్చారు. అనంతరం 35 మందిని ఉచిత కంటి ఆపరేషన్ కోసం తరలించారు. ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కోనేటి రవిరాజు, ప్రెసిడెంట్ బాబు నాయుడు, కార్యదర్శి రామ్మోహన్‌వర్మ, కోశాధికారి లోకనాథ నాయుడు, వాసన్ ఐకేర్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన గ్రంథాలయ శిక్షణా శిబిరం

పుత్తూరు, జూన్ 7: పుత్తూరు పట్టణంలోని జిల్లా గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహించిన వేసవి శిక్షణాశిబిరం శుక్రవారం ముగిసింది. ఈ శిబిరంలో విద్యార్థులకు పుస్తక పఠనం, డ్రాయింగు, ఆటలు వంటి వివిధ అంశాల మీద శిక్షణ ఇచ్చామని గ్రంథాలయ అధికారి మీనాకుమారి తెలిపారు. విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులను పంపిణీ చేశారు.

అతిసారను అరికట్టేందుకు చర్యలు

పుత్తూరు, జూన్ 7: పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని నందిమంగళం పంచాయతీలో ప్రబలిన అతిసార వ్యాధిని అరికట్టేందుకు శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది రంగంలోకి దిగి చర్యలు చేపట్టారు. నందిమంగళం, దళితవాడల్లో వ్యాధి ప్రబలి ఓ వ్యక్తి మరణించాడని వార్తలు వచ్చాయి. దీంతో స్పందించిన వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి వ్యాధి పీడితుల సర్వే చేసి, మందులను పంపిణీ చేశారు. మురికి కాల్వల పక్కన మందులను స్ప్రే చేశారు. దళిత వాడలో శుక్రవారం కూడా ఓ యువతికి వాంతులు, విరేచనాలు కావడంతో ఆస్పత్రికి తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

నగరిలో టీడీపీ జైత్రయాత్ర

● రెండు మున్సిపాలిటీలు, ఐదు మండలాల్లోనూ పూర్తి ఆధిక్యత
● చారిత్రాత్మక ఓటమి మూటగట్టుకున్న రోజా

పుత్తూరు అర్బన్, జూన్ 7: అశ్వమేధ యాగంలో యాగాశ్వం అడుగు పెట్టిన చోటల్లా ఆ రాజ్యం వశమైనట్లు నగరి అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అంతకుమించి జైత్రయాత్రను సాగించింది. నియోజకవర్గ పరిధిలోని రెండు మున్సిపాలిటీలు, ఐదు మండలాల్లోనూ పూర్తిస్థాయి ఆధిక్యతతో క్లీన్ స్వీప్ చేసింది. వైసీపీ కంచుకోటలను బద్దలు కొట్టింది. దీంతో రెండు దఫాలు అత్తెసరు మెజార్టీతో గెలిచిన వైసీపీ అభ్యర్థి రోజా.. ఈ ఎన్నికల్లో భారీ ఓటమిని మూటకట్టుకున్నారు. టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ అప్రతిహత విజయాన్ని సొంతం చేసుకున్నారు.

తొలి రౌండ్ నుంచే మొదలు

టీడీపీ జైత్రయాత్ర తొలి రౌండ్ అయిన వడమాలపేట నుంచే మొదలైంది. గత రెండు ఎన్నికల్లో వడమాలపేట ఇచ్చిన మెజార్టీతోనే వైసీపీ గెలుపొందింది. అలాంటి కంచుకోటలో ఇప్పుడు టీడీపీకి 6165 ఓట్ల మెజార్టీ లభించింది. దీంతో టీడీపీ గెలుపు ఖాయమనే అంచనా బలపడింది. ఈ ఐదేళ్లలో వడమాలపేటలో జరిగిన భూ ఆక్రమణలు ఎన్నడూ జరగలేదనే ప్రచారం ఉంది. దీంతో వైసీపీ అభిమానులు కూడా ఈ దఫా టీడీపీకి పట్టం కట్టారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పుత్తూరు మున్సిపాలిటీ సాధారణంగా టీడీపీకి అనుకూలం. ఈసారి అనూహ్యంగా 12,827 ఓట్ల మెజార్టీని సాధించింది. వైసీపీ దాడులు, దౌర్జన్యాలు, పోలీసు కేసులతో విసిగిపోయిన పట్టణ ఓటర్లు టీడీపీకి ఏకపక్ష విజయాన్ని కట్టబెట్టారు. అలాగే, వైసీపీకి కంచుకోట అయిన పుత్తూరు మండలంలో టీడీపీకి 3,203 ఓట్ల ఆధిక్యత లభించింది. నగరి మున్సిపాలిటీ ఈ దఫా కూడా టీడీపీకి అండగా నిలిచింది. మెజార్టీ మాత్రం ఏకంగా 11,928కి ఎగబాకింది. నగరి రూరల్‌లోనూ 2,954 ఓట్ల మెజార్టీ లభించింది. హోరాహోరీగా ఉండే నిండ్ర మండలంలో ఈసారి 3,689 ఓట్ల మెజార్టీ వచ్చింది. టీడీపీకి అనుకూలంగా ఉండే విజయపురం మండలం.. ఈ దఫా 3,099 ఓట్ల మెజార్టీని ఇచ్చింది. పోస్టల్ బ్యాలెట్లలోనూ 1,139 ఓట్ల ఆధిక్యత లభించింది. ఇలా ప్రతి రౌండ్‌లోనూ మెజారిటీ సాధించిన టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ 45,004 ఓట్ల మెజార్టీతో విజయకేతనం ఎగురవేశారు.

కకావికలమైన వైసీపీ...

నగరి నియోజకవర్గంలో టీడీపీ జోరుతో వైసీపీ కకావికలమైంది. అన్ని మండలాలు, మున్సిపాలిటీలను టీడీపీ క్లీన్ స్వీప్ చేస్తుండటంతో కౌంటింగ్ కేంద్రంలో వైసీపీ చేష్టలుడిగి చూస్తూ ఉండిపోయింది. రోజా భర్త సెల్వమణి సొంత సామాజికవర్గమైన మొదలియార్ బెల్ట్‌ను టీడీపీ క్లీన్ స్వీప్ చేసింది. పుత్తూరులోని గేటుపుత్తూరు, నగరి మున్సిపాలిటీలోని సత్రవాడ, కేవీఆర్ పేట, పుదుపేట, ఏకాంబరకుప్పంలో మొదలియార్ సామాజిక వర్గం ఏకపక్షంగా టీడీపీ వైపు మొగ్గుచూపింది. ఒక్కొక్క పోలింగ్ కేంద్రంలో సరాసరి ఐదు, ఆరు వందల మెజార్టీ టీడీపీ సాధించింది. రూరల్, అర్బన్ అనే తేడా లేకుండా ఓటర్లు ఏకపక్షంగా టీడీపీకి అనుకూలంగా తీర్పునిచ్చారు. ఈ ఐదేళ్ల పాలనలో నగరి నియోజకవర్గంలో జరిగిన విధ్వంసాలు, దౌర్జన్యాలు, భూఆక్రమణలు, సెటిల్‌మెంట్లు, పోలీసు కేసులతో విసిగిన నియోజకవర్గ వాసులు వైసీపీని చీదరించుకున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో రాష్ట్ర మంత్రి హోదాలో బరిలోకి దిగిన రోజాకు గతంలో ఎవరికీ దక్కనంత భారీ ఓటమి పొందారు.